**అందమైన ఊరది!**

ఆ ఊరంతటికీ అందమైన హోటలు పేరు ఊటీ! హోటల్ ఊటీ ఎంతందమైనదో అంత విలువైనది; అంత విలాసమైనదీను.

అందుచేత సాధార్ణంగా హోటల్ ఊటీలోకి ఖరీదైనవాళ్లే వొస్తుంటారు. విలాసాలకి విలువెంత వున్నదో వొచ్చినవాళ్లక్కడ తెలుసుకుంటారు. ఈ కారణంగా సామాన్య మానవులకక్కడ చోటు వుండదు. కాదు కూడదంటే వాళ్లందరికది ఏక్ దిన్ కా... బాసతే అవుతుంది.

హోటల్ ఊటీకి రాంప్రసాద్ వొచ్చిన వేళ సరిగ్గా రాత్రి తొమ్మిదిన్నర. అతని పక్కనే ఒక దేవత గూడా వున్నదప్పుడు. ఆ దేవత నిలువెల్లా ధగధగా మెరిసి పోతూన్న పుత్తడి బొమ్మలాగుంది. వాళ్లిద్దరూ కలిసి నవ్వినప్పుడు దేవత నవ్వొక్కటే స్పష్టంగా వినిపించి, అది అమృత ధారగామారి అతని పెర్సనాలిటీ మొత్తాన్ని మరిపించేస్తోంది. అప్పుడతను కించిత్తు గూడా బాధపడినట్టులేదు. మిాదుమిక్కిలి అతను గుండెల్నిండా యింత ఆనందాన్ని నింపుకుని పేలిపోతూన్నట్టు వుంది.

వాళ్లిద్దరూ సెవెంటీఫోర్‌లోకి వెళ్లేరు.

ఆ గది విశాలమైనదీ, అధునాతనమైనదీను. ఆ గది తలుపు తెరిచిన మనిషి రాంప్రసాద్‌కి వినయంగా దారి చూపించి పక్కకి తొలిగి నించున్నాడు.

'దటీజ్ రైట్.' అన్నాడు రాంప్రసాద్.

గదిలో అతను కూర్చున్నాడు. ఆమె కూర్చోలేదు,

'నేనెంతవరకు చెప్పేను?' అడిగేడతను.

'బాంబే టూర్ పూర్తి చేసేరు,'

'అవునా... అప్పుడేమయిందీ. ఎవడో ఫూల్ నా టూర్ విషయమై బాస్‌కి ఆకాశ రామన్న ఉత్తరం రాసేట్ట. నా దినచర్యంతా ఆ ఉత్తరంలో యిరికించేడు. రోజుకి నేనెన్ని పాపాలు చేస్తుంటానో, ఎంతమంది నెత్తురు తాగుతానో, ఎంత అవినీతిని తింటానో— ఇవన్నీ రాసిపారేసేడు. కుసుమని ఒక దరిద్రం మా ఆఫీసులో చేరి నాకు గొప్ప టార్చరిస్తే—అది నేను సహించలేక ఆ పిల్లని ఉద్యోగంలోంచి తొలిగించేను. ఇప్పుడెక్కడేడుస్తుందో నాకైతే తెలీదుగాని— దాని విషయమూ ఆ ఉత్తరంలో రాసేట్ట

ఫూల్.'

'ఎంత ప్రమాదం?'

'ఐతే! ప్రమాదమా? ఇంకా నయం. బాస్ బసవరాజు గురించి నాకు పూర్తిగా తెలుసు. మంచి యజమాని. తెలుగువాళ్లకి ఇంగ్లీషు మనిషి అతను. ఈ లోగట్టా సర్వం చదివి ట్రంక్ బుక్ చేసి నన్ను వివరాల డిగేడు. ఐ సెడ్ నథింగ్. ఆ తర్వాత ఎంక్వయిరీ నిమిత్తం సాక్షాత్తు బసవరాజే మా బ్రాంచి కొచ్చేడు. ఆఫీసంతా చెక్ చేసేడు. నేనేమైన తక్కువ తిన్న వెధవనా మిస్ లిల్లీ? ఈనాడు లక్షల్లో ఈ బ్రాంచి వ్యాపారం చేస్తుందంటే, ఇదంతా నా నిర్వాహకం. అంచేతనే మనిషి మరి నోరెత్తకుండా వొచ్చిందారినే వెళ్లిపోయేడు.'

ఆ చల్లటి మాట వినడంతోటే మిస్ లిల్లీ కూర్చోగలిగింది. కూర్చుని తన అందమైన రెండు చేతుల్నీ గుండెలమీద వుంచుకుని, ఇంతగాలి పీల్చుకుని అన్నది—

'ఊష్...గండం గడిచింది బాబు! అదిరి చచ్చిపోయేను.'

అతనెంతో తేలిగ్గా, గొప్పగా ఎక్కువసేపు నవ్వేసి ఇంకాస్త సర్దుక్కూర్చుని రీజెంట్ సిగరెట్టు ముట్టించి కాళ్లురెండు వూపుతూ, సిగరెట్టు పొగని పైకి వొదులుతూ అన్నాడు.

'చిన్నప్పట్నుంచీ నాకు సాహసాలంటే మహాయిష్టం. ఒక్క మాటలో చెప్పాలంటే నేనుత్త సాహసాల మనిషిని. నా పదో ఏటనే నే నొక పాముని చంపేను. నాన్నగారి తుపాకి తీసుకుని ఆరోజుల్లోనే షికార్ చేసే వాడిని.'

'మనుషుల్నే!' ఆశ్చర్యపోతూ అడిగింది లిల్లీ.

'కాదు కాదు పిట్టల్ని. గురి తప్పేదికాదు. దెబ్బకిలా! కింద పడి గిలగిలా తన్నుకు చచ్చేవి. నాకప్పుడు వొళ్లు జలదరించేది.'

అతనికి ఉత్సాహం ఎక్కువైపోతున్నప్పుడు, అతని కళ్లు గూడా అరమోడ్పులవుతూన్నట్టు గమనించింది మిస్ లిల్లీ. అతను కొంచెం ఊగుతున్నట్టు గూడా పసిగట్టింది. ఇక్కడి కొచ్చేముందు సోమయాజులింట్లో జరిగిన విందులో అతను పుచ్చుకున్న 'వేట్ సిక్స్టీనైన్' వైనం వెంటనే స్ఫురించింది. మిస్ లిల్లీ మరేం మాటాడకుండా అతను చెప్పబోయే ఉల్లాసాన్నీ; అల్లర్నీ శ్రద్ధగా వినాలని తొందర పడింది. ఆ కారణంగా ఆమె కొంచెం ముందుకు జరిగింది.

'సిక్స్టీవన్‌లో కాబోలు! బసవరాజుతో పరిచయం నాకు. అతను నన్ను రెండేళ్లు పరీక్షచేసిగానీ, ఈ ఉద్యోగం యివ్వలేదు. క్రమశిక్షణంటే అతనికి ఆరో ప్రాణం. దాన్ని నేనిక్కడ నిర్లక్ష్యం చేసి తిరుగుతున్నానని ఆ ఉత్తరం చెబితే — నిజానికి మరోడు మరోడైతే ఉరేసుకున్నంత పని. బట్! రాంప్రసాద్ బెదిరి అదిరిపోయే మనిషికాదు. నేను నటుడినన్న సంగతి నీకు తెలిసే వుంటుంది.'

'అవునవును. అది నేనెలా మరిచిపోతాను? యూనివర్సిటీ...'

'స్టాపిట్. గుర్తుచేయకు మిస్ లిల్లీ. నాకేడుపొస్తుందంతె. ఇప్పుడు చెప్పు ఆనాటి రాంప్రసాద్‌లోని ఉత్సాహం ఈనాటికొచ్చి రవంతైనా తగ్గిందా?'

'లేదు.'

'థేంక్స్...నిజమే. బాస్ బసవరాజుకి నేను లక్షలు సంపాయించిపెడుతున్నాను. అతన్నాకు జీతంగా కొంత పే జేస్తున్నాడు. ఆ కొంత నాకు చాలదు. ఆ కొంతలోనే నన్ను బతికేయమని అతను ఆర్డరేస్తే నేనందుకు ఛస్తే వొప్పుకోను. నాకింకా ఎక్కువ కావాలి. బిజినెస్‌లో మనిషి మరో మనిషిని ఉద్ధరించాలనే ధర్మసూత్రం ఎక్కడాలేదు. అందుచేత, ఈచేత్తో అతనికి లక్షలు సంపాయించి, మరోచేత్తో నేను వేలు తీసుకుంటున్నాను. వేలు తీసుకునే చేతిని అతను నరికిపారేస్తే అతనికొచ్చిపడే లక్షలమాటేమిటి? బంద్. రాంప్రసాద్ బిజినెస్ చేయలేడు. కనక ఏమిటి చేస్తున్నాను—ఇటు నేనూ, అటు అతనూ బాగుపడే మార్గాన్ని నేను అనుసరిస్తున్నాను. దీన్లో అవినీతి, క్రమశిక్షణా అనీ పెద్ద పెద్ద మాటలకి స్థానం లేదంతె. ఏ మై కరెక్ట్?'

'కరెక్ట్.'

'అందుచేత—నువ్వు రేపొద్దున హైద్రాబాద్ వెడతావు. నీకు బసవరాజు బాగా తెలుసు. అతన్తో, అవకాశం చిక్కినప్పుడు నాగురించి 'మంచే' చెప్పు. అతనడక్కపోయినా సరే—నువ్వే చెప్పు. జస్ట్ ట్రై.'

మిస్ లిల్లీ రాంప్రసాద్‌ని ఏడిపించాలనే ఉద్దేశంతో మరి కొంచెం దగ్గిరిగా జరిగి, అతని కళ్లలోకి చూస్తూ అన్నది—

'నీకు సాహసాలంటే యిష్టం! నీ పదో ఏట పాముని చంపేవు. పిట్టల్ని కాల్చేవు. అలాటిది, మై డియర్ ప్రసాద్—బసవరాజుతో నేను నీగురించి మంచే చెప్పాలని ప్రాధేయపడతావెందుకు?'

'వండర్ ఫుల్! నేను తాగి వున్నానరే, మనిషిని యిట్టే చదివేయగలను తెలుసా? నువ్వొకటి మరిచిపోతున్నావు లిల్లీ! నాకీలాటి ఉద్యోగమిచ్చాద మోజెక్కువని నీకూ తెలుసుగదా. ఇంతపెద్ద ఉద్యోగం ఎవడో ఒక అనామకుడి దుష్ప్రచారంతో మట్టికొట్టుకుపోవడం నాకిష్టంలేదు. గనక నేనీ ఉద్యోగం నిలుపుకోవడమనేది గూడా ఒక గొప్ప గేమ్! సాహసం! అందుచేత నేనీ విషయంలో జాగ్రత్తగానే వుండాలి. అది రూలు.'

అప్పుడు మిస్ లిల్లీ పకపకా నవ్వేసింది!

'నిజం చెప్పనా మిస్ లిల్లీ! ఒక అందమైన ఆడపిల్ల, నాకు అతి దగ్గిరిగా కూర్చుని అందంగా నవ్వేస్తుంటే నన్ను నేనే మరిచిపోతాను. నాకు ఆవేశం ఎక్కువ. నేనుత్త తొందరమనిషిని. వింటున్నావా?'

'ఏమో, అలా అని నువ్వు చెప్పడమైతే వింటున్నాను గానీ, నిజమని నమ్మలేదింకా.' అన్నది మరింత అందంగా నవ్వేస్తూ.

రాంప్రసాద్‌కి కోపం వొచ్చింది. సిగరెట్టు పారేసేడు. మనిషి యావత్తూ నిద్రొచ్చినవాడిలా జోగేతూ తలుపు దగ్గిరికి వెళ్లేడు. తలుపు వేస్తుండగా అతనో మనిషిని చూచి అక్కడే ఆగిపోయేడు. రాంప్రసాద్‌ని చూచి ఆ మనిషి వేగంగా వొచ్చేడు.

'నాలుగ్గంటల్నుంచీ మీ కోసం తిరుగుతున్నాను.' అన్నాడతను వినయం నటించి.

'ఏమిటి విశేషం?'

'ఇవాళొక విశేషమే జరిగింది సార్! మా ఫ్రెండ్‌ని రైల్లో ఎక్కించేందుకు స్టేషన్‌కి వెళ్లేను. అతన్నెక్కించిన తర్వాత రైలు కదిలింది. ఆ రైల్లో బసవరాజుగారు కనిపించేరు సార్!'

'వాట్?'

'నిజం సార్!'

'ఎక్కడ నుంచి ఎక్కడికి వెడుతున్నాడో?'

'తెలీదుసార్.'

'నిజమే చెబుతున్నావా జగన్నాథం?'

'సచ్చి నిజం సార్! ఈ కళ్లతో నేను

చూసేను. సాక్షాత్తూ బసవరాజుగారే!'

'అయితే నువ్వు పద. నేనొస్తున్నాను.'

జగన్నాథం వెళ్ళిపోయింతర్వాత రాంప్రసాద్ లోపలికొచ్చేడు.

'ఏమిటిట? వొచ్చిందెవరు?'

'జగన్నాథమని మా ఆఫీసతను. అదిసరే గానీ, నువ్వూ జనతాలోనే వొచ్చేవుగదూ?'

'అవును. అయితే ఏమిటిట?'

'ఆ రైల్లో బసవరాజు రాలేదూ? నువ్వతన్ని చూళ్ళేదూ?'

లిల్లీ మళ్ళీ నవ్వబోయి ఆగి అన్నది—

'పాములన్నీ, పిట్లలన్నీ, సాహసాల్నీ లెక్కచేయని రాంప్రసాద్ బసవరాజనబడే ఒక మనిషికి భయపడి ఛస్తున్నాడంటే నాకు నవ్వొస్తుంది. నువ్వేడ్చి పోనంటే జాలి గూడా కలుగుతోంది. పిటీ. పిటీ!'

'నాన్ సెన్స్. నీకు వేళాకోళంగా వున్నట్టుంది'

'కాదామరి? అంత పొడుగ్గా వున్న రైల్లో, అంతమంది ప్రయాణీకుల్లో బసవరాజుని చూసేవా అని అడగడమేమిటి? నేనొచ్చిందేమైనా స్టేట్ బస్సులోనా — నలభై మందిలో అతన్ని పసిగట్టేందుకు? బలేవాడివి ప్రసాద్.'

'గుడ్ నైట్ నేనొస్తాను.'

'అప్పుడే?'

'నాకు పనుంది. వెళ్ళాలి.'

'ఆవేశం ఎక్కువన్నావు. తొందరమనిషివన్నావు. అందమైన ఆడపిల్లా, అందమైన...'

'ప్లీజ్. మరోసారి నిన్ను తప్పకుండా కలుసుకుంటానుగా. వొస్తా. లెట్ మి గో...' అన్నాడతను ప్రాధేయపూర్వకంగా.

అప్పుడు లిల్లీ గట్టిగా అరిచేసింది.

'గో...ఇప్పుడు నేను నీ మెడకి కళ్ళెం వేయలేదే! రాకరాక వొచ్చేను; ఎన్నో నెలలగ్గాని నిన్ను చూడ్డం పడలేదని నేనిదైపోతుంటే, వెళ్ళిపోతానని నువ్వు మారాం చేస్తే నేను కాదన్నా నువ్వాగుతావా? గో డియర్ గో!'

రాంప్రసాద్ చేతికున్న వాచీని, గది తలుపునీ రెంటినీ చూసేడు. మిస్ లిల్లీ కళ్ళల్లో టెక్నికలర్ భావాన్నీ చూసేడు. అందుచేత అతను తలుపువేసి లిల్లీని చేరుకున్నాడు.

* * *

బసవరాజు అండ్ బ్రదర్స్ తాలూకు ఈ బ్రాంచి ఆఫీసు ఒక పెద్ద పాతగూడు. ఈ పాతగూడు అందంగా వుంటుంది. ఈ పాతగూడులో కొందరుద్యోగస్థులున్నారు. వాళ్ళంతా దౌర్భాగ్యులని చెప్పడం మంచిది కాదు. కొంద రదృష్టవంతులక్కడ వున్నారు.

లౌక్యం తెలిసిన మనిషి సర్వసాధారణంగా జీవితంలో ఓడిపోవడమంటూ జరగదు అలాటి మనిషికి జీవితం చాలా అందుబాటులో వున్నట్టు, చెప్పినట్టు నడిచే యంత్రం మాదిరి సాగిపోతుంటుంది.

ఆ మనిషిక్కొన్ని సూత్రాలుంటాయి. ఏ ఎండకా గొడుగు అన్నట్టు అతని చేతిలో కొన్ని గొడుగులూ వుంటాయి. దేవుడయ్యేదీ, వాడి తల తన్నేవాడయ్యేదీ — అతని గొడుగు నీడని చేరి బ్రతకవలసిందే.

ఇలాటి లౌక్యం నరనరాన్న ప్రవహిస్తున్న మనిషి పేరు జగన్నాథం. మనిషి మొత్తం 'పీనుగ'లా వున్నా, అమోఘమైన తెలివి కతను కేంద్రస్థానం. మహామహా గొప్పవాళ్ళతో అతను కుస్తీలు పట్టేసి వాళ్ళని సునాయసంగా చిత్తుచేసేయగల దిట్ట. అంతటి వాడికి ఈ రాంప్రసాద్‌ని బొమ్మగా చేయడం ఏమంత దుస్సాధ్యమైన కార్యం కాదు.

రాంప్రసాద్ ఈ బ్రాంచికి మేనేజరైన శుభముహూర్తాన ఈ పీనుగ అక్కడే వున్నాడు. అప్పట్లో అతను మరింత అసహ్యంగా వుండేవాడు. ఎటొచ్చీ—అప్పుడూ యిప్పుడూ మారనిది అతని వక్రబుద్ధి!

జగన్నాథానికి నీతిపట్లా, ధర్మం పట్లా అమోఘమైన ఆసక్తి లేదు. మనిషన్నవాడు గొప్పగా బతకాలనుకున్నప్పుడు—ఈ రెండు బరువు మాటల్నీ తొలవతల పారేయాలనేది అతని సిద్ధాంతం.

ఎదటి మనిషిని చూ(?)చూడటంతోటే, అతని ఆలోచనలన్నింటినీ గ్రహించి, ఎక్కడే దెబ్బతీయాలో గమనించి మరీ సంచరించే ఒక్కటి జంతువతను; చెడ్డ ఆకలితో, బోనులో దిక్కుతోచక దిక్కులన్నీ మార్మోగేలా గాండ్రించే ఆకలి పులి అతను! అతని కళ్ళు, అతని చూపూ ఎల్లప్పుడూ మండిపోతూనే వుంటాయి.

అంతటి జగన్నాథం సాధారణంగా నవ్వడు. ఎదటివాడి వినోదం కోసం అతనెప్పుడైనా నవ్వ ప్రయత్నిస్తే, అది కటువుగానూ, దుర్మార్గంగానూ కనిపించినా, ఆ నవ్వు ఎదటి మనిషిని చిత్తు చేసేయగలదు.

రాంప్రసాద్ పట్ల జగన్నాథానికున్న అభిప్రాయాలు రెండు:

'శ్రీవారు దర్జాగల పురుషులు. వారెంతో వినయ సంపన్నులు. రేయింబవళ్ళు నిస్వార్థ చింతనతో కష్టించి అంత బ్రాంచీని ఇంత చేసేరు. కుర్రవాళ్ళయినా, వ్యాపారానుభవంలో తల నెరిసిపోయిన మహానుభావులు. అందుచేతనే బసవరాజుబాబుగారు ప్రసాద్ బాబుగారిని నెత్తిమీదెట్టుకున్నారోయ్ నన్నాసులూ! మీకు తెలిదేమిటి—శ్రీవారు అజేయులు.'

ఇక రెండో పక్క:

'కుర్రముండా కొడుకు! జోరుచేస్తున్నాడు. పట్టపగ్గాల్లేవు వీడి అవినీతికి. కిందా మీదా పడి వేలకివేలు అన్యాయంగా ఆర్జించేస్తున్నాడు. కళ్ళులేని బాస్‌కి వీడొక దేవుడై పోయేడు. వెధవ — ఎలకలాటి మనిషికి ఏనుగంత జాతకమూ! ఒరే ప్రసాదూ, నీ రోజులు దగ్గర పడ్డాయిరా బాబూ! ఆనాడు నిన్ను దేవుడు గూడా రక్షించలేడు.'

కనక, జగన్నాథం అసాధ్యుడు. ఆ బ్రాంచీలోనేకాదు — ఈ ప్రపంచంలో ఎక్కడే మూల విసిరికొట్టినా అక్కడ గూడా నిక్షేపంగా బతికేయగలడతను.

ఆ బ్రాంచీలోనే ఒక గంగిగోవూ గలదు. దానిపేరు ముకుందరావు బి. ఎ. భూమ్మీదున్న శోకాన్ని యావత్తూ తన నెత్తిమీదే పెట్టుకున్నట్టూ వున్నా అతనెంతో అందమైనవాడు. అంతందమైన మనిషి మీద దేవుడు పగబట్టాని యిలా చిత్రహింస పెట్టేస్తున్నాడా పాపం అనే భ్రమ అతన్ని చూచేవాడికి కలుగుతుంది.

ఆనాడక్కడ ఆకలి పులి గంగిగోవు మీద విరుచుకు పడింది—

'మరేం చెప్పకు ముకుందం! నాకు వొళ్ళు మండిపోతోంది. నాకన్నీ తెలుసు. ఏమిటనుకుంటున్నావో ఏమిటో. నువ్వు నోరు తెరుస్తే—ఆ ... అంతే టకటకా నీ జాతకం చెప్పేయగలను. కొలవిచ్చేంత వరకూ నా ప్రాణం తీసేసేవ్. ఇచ్చింతర్వాత నీ యిష్టమొచ్చినట్టు పొడిగింపులు. ఏమిటో అనుకున్నాను. మెత్తటి మనిషి (మొత్తినా ఫర్లేదు), ఏదో బుద్ధిమంతుడవటాని యిన్నాళ్ళూ అనుకున్నాను. ఇక చాలు. వెళ్ళు...వెళ్ళు...'

ముకుందరావు రెండు నిమిషాలు మీళ్ళ

# పరివృత్తం

నెమిలి మెల్లిగా అనగలిగేడు—

'సార్! నేను సెలవు పెట్టడం వల్ల మీరింత—'

'ఎంతేమిటయ్యా? ఇంతంటున్నావు. సెలవు సెలవు, నీ సర్వీసంతా సెలవ లోనే తగలడేట్టుంది.'

'నాకో కుటుంబం వుంది—'

'ఎవరికిలేదు? ఆకాడికి మేమంతా సన్యాసులమా, శంభో హరహరా అన్చెప్పి దేశాలు తిరిగేందుకు, ఇదుగో ముకుందరావు, ఆట్టే మాటాడకుండా వెళ్ళిపో, నీ పనేదో చూచుకో, అయ్యగారొచ్చే వేళవుతోంది— వెళ్ళి కూచో బాబు వెళ్ళు.'

ముకుందరావు అతి నెమ్మదిగా వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు. చేతి రుమాలుతో మొహం తుడుచుకుని చూపు బల్ల మీదుంచేడు.

గంగిగోవు పక్కడ పులి తింటూన్న వేళకి, సరిగ్గా అప్పుడే వొచ్చింది. ఒక కిరణం, ఒక వెలుగు, ఒకగాలి, సుగంధం, కొత్త తేజస్సు. ఆఫీసు ఆఫీసంతా తలలెత్తి దిగ్భ్రాంతిలో చూపులన్నీ ఆ ఆకారం మీద కేంద్రీకరింప జేసేరు.

ఆఫీసు ప్యూన్ వాగన్న లేచి గుమ్మం దగ్గిరిగి వెళ్ళేడు—

'ఎవరు కావాలమ్మా!'

'మేనేజరు గారు—'

వీణ తంత్రులు రమణీయమైన సంగతి వేసినట్టుందా మాట.

జగన్నాథం లేచి నించుని వినయంగా అన్నాడు.

'లోపలికి రండి.'

ఒక అప్సరస భూమ్మీదికి దిగి, మునుపే ఎంచుకున్న స్థలంలో నడిచినట్టు అతి జాగ్రత్తగా నడిచి వొచ్చిందామె, వొచ్చి జగన్నాథం ముందు నించుంది.

'కూర్చోండి' అన్నాడు జగన్నాథం.

కూర్చున్నది.

'చెప్పండి, మీకేం గావాలి?'

'మీరేనా మేనేజరు?'

జగన్నాథం తలొంచుకుని నవ్వేసి తలెత్తి అడిగేడు.

'ముందు పేరేమిటో చెప్పండి.'

'మిస్ ఇందిర!'

'చూడండమ్మా ఇందిరగారూ! నాపేరు జగన్నాథం, అయ్యగారింకా రాలేదు. వారొచ్చే వేళయింది. వారికి నేను పి. ఏ. ని! మీకేం అభ్యంతరం లేకపోతే మీరొచ్చిన పనేమిటో చెప్పండి. అయ్యగారికి కొంచెమైనా శ్రమ తప్పించిన వాడి నవుతాను.'

ఇందిర ఆఫీసునంతా కలయజూసింది. అందరూ మగవాళ్ళే కనిపించేరు. ఓ చోట టైపు మిషను శబ్దం వినిపించగా— అటువేపు చూచింది. ఓ పాత టైపు మిషను ముందు ఒక బంతిపూవు కనిపించడంతో ఆశ్చర్యపోయింది. ఇంతమంది మగవాళ్ళమధ్య ఒక ఆడపిల్ల గూడా ఉద్యోగం చేస్తున్నదని తెలీగానే చెప్పలేనంత ఆనందవూ కలిగింది.

'మీరొచ్చిన పనేమిటో ...' జగన్నాథం అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డు లాగా యింకా గుణుస్తూనే వున్నాడు.

అప్పుడు చెప్పింది ఇందిర—

'మొన్ననే హెడ్ ఆఫీసులో ఇంటర్వ్యూ జరిగింది. నేనా ఇంటర్వ్యూలో సెలెక్టయ్యేను. ఇక్కడున్న ఓ ఖాళీలో నన్ను పోస్టు చేసేరు.'

అది విన్న తర్వాత జగన్నాథం గాలి పీల్చుకున్నాడు. చేతులు రెండూ బల్ల కానించి అన్నాడు.

'అయితే ఉద్యోగాని కొచ్చేరన్నమాట. బాగుంది. మంచిది. అట్లాగే. భేష్...'

జగన్నాథం దండక మెందుకు చదువుతున్నాడో ఇందిరకి అర్థం కాలేదు. అందుచేత విత్తరపోయి, బంతిపూవువేపు చూచింది.

సరిగ్గా అప్పుడే బంతిపూవూ ఇందిర వేపు చూచి అనుకున్నది—

'పాలెగూడిది! వెళ్ళిపో ఇందిరా. వెళ్ళిపో!'

జగన్నాథం, తన తలపైన తిరుగుతూన్న పంకావేపు చూస్తూ జనాంతికంగా అనేసేడు.

'అవును గదూ! కుసుమ రాజీనామా యిచ్చిన సంగతే నేనెప్పుడో మరిచిపోయేను. అవునవును. ఇక్కడొక ఖాళీ వుందిగా. అలా చెప్పు. అవుతే బసవరాజుగారు ఈ ఖాళీని పూర్తిచేసేరన్నమాట. బాగుంది.'

ఒక బల్ల దగ్గిర ఇద్దరున్నారు. బెదురుతూ ఇందిరవేపు చూచి అనుకున్నాడు.

'మళ్ళీ అమ్మాయే? బాస్‌కి మంచి టేస్టుంది గురూ!'

'ఇంత చక్కటి అమ్మాయి ఉద్యోగం చేయడం నాకిష్టంలేదు.'

ముకుందరావు ఇందిరని చూచి, తల దించుకున్నాడు.

జగన్నాథమే అన్నాడు.

'చూడిందిరా! మరి నీ వెంట ఆఫ పొర్డరూ వగైరా తెచ్చుకున్నావా?'

ఇందిర తలూపింది.

'అవుతే—నువ్వెళ్ళి ఆ టైపిస్టు పక్కనే కూర్చో. అయ్యగారొచ్చేవేళయింది. ఆయనొచ్చిం తర్వాత జాయినింగ్ రిపోర్టిద్దువుగాని. వెళ్ళి అక్కడ కూచో.' అన్నాడు జగన్నాథం.

ఇందిర టైపిస్టు దగ్గిరకి వెళ్ళి నించుంది. అక్కడ వాగన్న వేసిన కుర్చీలో కూర్చుంది. కూర్చుంటూ బంతిపూవుతో అన్నది.

'నా పేరు ఇందిర.'

'విన్నాను. మంచిపేరు!'

'మీ పేరు?'

'పద్మ. అవును గానీ; ఎంతవరకు చదివేవు?'

'బి. ఏ. పాసయ్యేను.'

'ఉద్యోగం చేయాలని సరదానా? లేక అవసరమా?' అన్నది పద్మ ఇందిరవేపు సూటిగా చూస్తూ.

ఇందిర క్షణ మాగి చెప్పింది—

'రెండూను.'

అప్పుడు పద్మ చాలా విచిత్రంగా అన్నది.

'ఇక్కడ నువ్వు ఉద్యోగం చేయలేవు ఇందిరా! వెళ్ళిపో.'

'అది మీకెలా తెలుసు?'

'నిన్ను చూడగానే అలా అనిపిస్తోంది.'

'మరి మీరెలా చేస్తున్నారు?'

ఆ ప్రశ్నకి పద్మ జవాబు చెప్పలేదు. టైపు చేసుకోడం ప్రారంభించింది. మధ్యలో మళ్ళా అడిగింది ఇందిర.

'చెప్పరేం? మీరిక్కడ ఉద్యోగ మెలా చేస్తున్నారు?'

'గతిలేక ఇందిరా! గతిలేక.'

'నేనూ అందుకేనని మీరెందుకు అనుకో కూడదు?'

'నీకో కథ చెప్పేదా?'

'ఇప్పుడే చెబుతారా?'

'సంక్షేపంగా. చిన్న కథే. అయితేనేం మహా భయంకరమైన కథ. ఇదే ఆఫీసులో నీ అంత అందమైన అమ్మాయే కుసుమని

ఒక ఆడపిల్ల ఆర్నెల్లు ఉద్యోగంచేసి మానేసింది.'

'ఎందుకనిట ?'

'ఇక్కడ వాతావరణం సరిపడక.'

'మీకు సరిపడిందా ?'

పద్మ పేలవంగా నవ్వేసి అన్నది.

'నేను రాతిబొమ్మ నిందిరా! వాళం. నిశ్చింతంగా వున్నాను. ఇక్కడ మల్లెపూవులకి మాత్రం చోటు లేదు.'

పద్మ చేతికున్న అందమైన వేళ్లు టక టగా టైపు చేస్తూంటే చూచేందుకు తమాషాగా వున్నది ఇందిరకి. కాసేపాగింతర్వాత పద్మ తలెత్తి ఇందిరవేపు చూచింది ఇందిరేదో ఆలోచిస్తున్నట్టు కనుపించడంతో అడిగింది.

'భయంగా వున్నదా చెల్లీ?'

ఇందిర ఉలిక్కిపడింది.

'వాదంతా పిచ్చిగోల. నీకేంతోస్తే అది చెయ్యి.' అన్నది పద్మ.

'కుసుమకి వాతావరణం ఎందుకు సరి పడలేదు?'

'చెప్పక తప్పదా?'

చెప్పండి!'

ఎంతో రహస్యంగా చెప్పింది పద్మ

'కుసుమని మోసం చేసేడు మేనేజరు. ఆ అమ్మాయి బతుకు అల్లరిపాలు చేసేడు. ఎన్నో ఆశలు చూపించి దగాచేసేడు. అందుకు —అందుకే కుసుమ యిక్కడ్నుంచి పారిపోయింది. గుండె నిబ్బరం గల మనిషి కనుక చావలేదు.'

—పన్నెండున్నరకి మేనేజరు కారు హారను వినిపించడంతో ఆఫీసులో కలవరం విజృం

# పరివృత్తం

భించింది. జగన్నాథం సీటు నుంచి లేచి గబగబా గుమ్మం దగ్గిరికి వెళ్లి నించున్నాడు.

ఖరీదైన సూటులో రాంప్రసాద్ మంచి దర్జాగా వున్నాడు. అతను విలాసంగా సిగ రెట్టు కాల్చుకుంటో, జగన్నాథం అందిం చిన నమస్కారాన్ని పుచ్చుకుని తన గదిలోకి వెళ్లిపోయేడు. వెనకనే జగన్నాథమూ వెళ్లేడు.

ఆఫీసంతా నిశ్శబ్దంగా వున్నది.

పది నిమిషాల తర్వాత నాగన్న వొచ్చి ఇందిర దగ్గిరున్న ఆఫీసార్డరు పుచ్చుకుని రాంప్రసాద్ గదిలోకి వెళ్లేడు. మరో అయిదు నిమిషాలకి ఇందిరకి పిలుపొచ్చింది. ఇందిర లేచి నించున్నప్పుడు పద్మ విసురుగా టైపు చేయడం మొదలు పెట్టింది.

రాంప్రసాద్ ఎదట నిలబడి నమస్కారం చేసింది ఇందిర. అతను ఇందిరవేపు చూడ కుండానే.

'కూర్చోండి.' అన్నాడు.

ఇందిర పొందిగ్గా కూర్చుంది.

'యూ ఆర్ బి. ఎ?' అన్నాడతను.

తలూపింది ఇందిర.

'వెరీగుడ్. మిస్టర్ జగన్నాథం, ఇందిర దగ్గిర జాయినింగ్ రిపోర్టు తీసుకో. ముందు ఫార్మాలిటీస్ పూర్తిచేయండి. గో.' అన్నాడు.

జగన్నాథం ఇందిర దగ్గిర జాయినింగ్ రిపోర్టు తీసుకుంటూండగా, అతను మిస్ లిల్లీ అఫీసు ప్రవేశాన్ని తిలకించేడు. అందు చేత వినయంగా లేచి నిలబడి అన్నాడు.

'రండి. రండి. అయ్యగారిప్పుడే వొచ్చేరు—లోపలున్నారు.'

జగన్నాథం మాటలు మిస్ లిల్లీ విని పించుకోలేదు. గబ గబా రాంప్రసాద్ గదిలోకి అడుగుపెట్టి, తలుపు మూసి అక్కడే వయ్యారంగా నించుంది.

మిస్ లిల్లీని చూచిన రాం ప్రసాద్ ఆశ్చర్య పోయేడు.

'గుడ్‌గాడ్! నువ్వింకా వెళ్లలేదన్న మాట?,

'ఎలా వెడతాను?'

'అదేమిటి?'

లిల్లీ ఒక కుర్చీని అతని దగ్గిరిగా లాక్కుని కూర్చుంది. కూడా తెచ్చుకున్న వేనిటీ బాగ్‌లోంచి ఒక పర్సుని తీసి బల్ల మీదుంచి అన్నది—

'ఎంత డబ్బు సంపాయిస్తే మాత్రం, డబ్బుమీద నిర్లక్ష్యం ఆరోగ్యానికి మంచిది కాదు మైడియర్ ప్రసాద్! రాత్రి ఈ పర్సుని నా దగ్గిర పోగొట్టుకున్నావు. పర్సులో ఆరొందల యిరవై రూపాయి లున్నాయి. అఫ్‌కోర్స్—ఇరవై నేను వాడు కున్నాను. మిగతా అరొందలూ పర్సుతో సహా పట్టుకొచ్చేను. ఇకనుంచైనా డబ్బు విషయంలో జాగ్రత్తగా వుండు.'

అప్పుడు రాం ప్రసాద్ పకపకా నవ్వేడు నవ్వు ఆపి అన్నాడు—

'వెల్. ఇందుకా నీ ప్రయాణం ఆపు కున్నావు. యూమేడ్!

ఆ డబ్బు కావాలనే నీ దగ్గిర పోగొట్టు కున్నాను, కనక మిగతా అరొందల పర్సూ నీది. హేవిట్!'

'నా కెందుకింత డబ్బు!' అన్నది లిల్లీ ఆశ్చర్య పోతూ.

'అది నాయిష్టం. పోలెత్తకుండా పర్సు తీసుకో, బసవరాజు దగ్గిర నా గురించి మంచి చెప్పు. ఆ సహాయం చాలు.'

'అంటే ఇది లంచమా?'

అతను రెండు చేతుల్నీ గాల్లోవూపి, గుప్పెటగా బిగించి మృదువుగా అన్నాడు.

'నీ యిష్టం, నువ్వేమైనా అనుకో. ఆ పర్సునీది. అంతే'

లిల్లీ కళ్లతో నవ్వేసి, పర్సు పుచ్చుకుని చిలిపిగా అన్నది—

'ఏది మాస్టర్ బ్రెయిన్ మైడియర్?'

(రెండో భాగం పైవారం)